**యువజన, శ్రామిక, రైతు కాంగ్రెస్ పార్టీ కోశాధికారి శ్రీ పి. కిరణ్‌కుమార్ రెడ్డిగారికి...**

మార్చి 17,18 తేదీలలో, వై. ఎస్. జగన్మోహన రెడ్డి అపసవ్య మానసిక స్థితిని విపులీకరించుతూ ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కథనం అబద్ధమని, ఆధార రహితమని, కించపరిచేలా వుందని పేర్కొంటూ అందుకు గాను నిర్నిబంధమైన క్షమాపణ తెలియజేయాలని మీరు నాకు, ఆంధ్రజ్యోతి సంపాదకులకు నోటీసులు పంపారు. అలా తెలపని పక్షంలో మాపై న్యాయపరమైన చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

మీ పార్టీ తరుపున ఇలా అధికారికంగా, వ్రాత పూర్వకంగా నోటీసు పంపగల హక్కు మీకు ఎక్కడనుండి, ఎలా సంక్రమించింది? మీ పార్టీకి ఇటువంటి హక్కు లేదు.

తన మనస్తత్వం అపసవ్యమైందన్న, తనకు మానసిక స్వస్థత లోపించిందన్న కథనం, తన ప్రతిష్టను దిగజార్చిందని, తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తుందని జగన్ భావించితే అతను మా మీద పరువునష్టం దావా వేయవచ్చు. కోర్టుకు లాగవచ్చు. అతను అలా చేస్తే, ఆ పరిణామాన్ని మేమెంతగానో ఆహ్వానిస్తాము. జగన్ విపరీత మనస్థితిని ప్రతిబింబించే సాక్ష్యాధారాలన్నీ న్యాయస్థానానికి సమర్పించి జగన్ అపసవ్య మనస్థితి గల వ్యక్తి అని సాధికారికంగా నిరూపించే, నిర్ధారించే అవకాశం మాకు లభిస్తుంది.

ఈ విషయమై జగన్‌కు తప్ప మీ రాజకీయ పార్టీకి మమ్మల్ని ప్రశ్నించే అధికారం లేదు. రాజకీయ పార్టీ స్థాపించు కోవడానికి ఎన్నికలలో పోటీ చేయడానికి ఏ రాజ్యాంగం మీకు హక్కు కల్పించిందో, మా అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి, ప్రచురించడానికి అదే రాజ్యాంగం హక్కును కల్పించింది. ఈ సర్వోన్నతమైన హక్కును ప్రశ్నించే అధికారం సహజంగానే మీ రాజకీయ పక్షానికి వుండదు.

అంతేకాదు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 29ఎ అధికరణ ప్రకారం మీ పార్టీ ఎన్నికల సంఘం వద్ద నమోదు కావడానికి, అందులోని 5వ నిబంధన ప్రకారం భారత రాజ్యాంగానికి పూర్తిగా బద్ధులమై వుంటామని ప్రమాణాన్ని జత పరచాలి. మీ నియమావళిలో ప్రముఖంగా ప్రచురించాలి. ఇప్పుడందుకు విరుద్ధంగా నా వ్యక్తి స్వేచ్ఛను, పత్రికా స్వాతంత్ర్యాన్ని మీ పార్టీ వ్రాత పూర్వకంగా ప్రశ్నించడాన్ని రాజ్యాంగ ధిక్కరణగా పరగణించి, మీ పార్టీ గుర్తింపు రద్దుచేయమని ఎవరైనా ఎన్నికల సంఘాన్ని కోరవచ్చు.

జగన్ అపసవ్య మనస్థితిని కళ్ళకు కట్టినట్టు వివరించిన కథనాన్ని అవగతం చేసుకోగల సామర్థ్యం, వివేకం, పరిణతి, ఈ వాస్తవాన్ని భరించగల ధైర్యం, మీకు గాని, మీ సలహాదారులకు గాని లేవని తెలిసినా, సహజమైన పాత్రికేయ ఆసక్తితో మీ లేఖను వివరంగా పరిశీలించి మరింతటి దిగ్భ్రాంతికి లోను కావడం జరిగింది. జగన్ అపసవ్య మనస్థితిని, ఎనిమిది ప్రధాన అంశాల ద్వారా, ఆ కథనంలో ప్రముఖంగా చర్చించితే అందులో ఒక్కటంటే ఒక్క అంశమైనా తప్పని మీ లేఖలో అసలు వివరించలేకపోయారు. అంటే మీరు నా కథనంతో దాదాపుగా ఏకీభవించినట్లే పరిగణిస్తాను. చివరిగా సూర్యుడిని, చంద్రుడిని, సత్యాన్ని ఏ ఒక్కరూ దాచి పెట్టలేరన్న గౌతమ బుద్ధుని సూక్తితో ఈ లేఖను ముగిస్తాను.